సాక్షి
వరంగల్
శుక్రవారం । 11 । జూలై । 2025




ఒకరి వెంట ఒకరు..
అనారోగ్య కారణాలతో పురుగుల మందు కలిపిన రాగిజావను తల్లికి ఇచ్చి తాను తాగడంతో జనగామలో తల్లికుమారుడు మృతిచెందారు. - 8లో▸



సైబర్ మోసగాళ్ల బరితెగింపు
పహల్గాం దాడి కుట్రలో సంబంధాలు ఉన్నాయంటూ ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడ్డారు. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.



సర్వే ఇలా..
శాంపిల్స్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల నుంచి పది మంది చొప్పున



ఒక్కరు లేదా ఇద్దరు..

అంతకంటే ఎక్కువ కనలేమంటున్న యువ జంటలు

ఉమ్మడి కుటుంబంలో ఉంటేనే సంతోషం ● 'సాక్షి' సర్వేలో స్పష్టీకరణ

'ఒక్కరు.. లేదా ఇద్దరు పిల్లలు చాలు. అంతకంటే ఎక్కువ మందిని కనే పరిస్థితులు లేవు. ఆ ఆలోచన కూడా మాకు లేదు' అని అంటున్నాయి యువజంటలు. దీంతోపాటు ఉమ్మడి కుటుంబం ఉంటేనే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేశాయి. మారిన జీవన పరిస్థితుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయాల్సి రావడం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడంతో ఈ తరం ఒక్కరు లేదా ఇద్దరితో సరిపెట్టుకుంటున్నారు. కానీ వచ్చే ఇరవై ఏళ్లలో యువజనుల జనాభా తగ్గి, సీనియర్ సిటిజన్ల సంఖ్య పెరుగుతుందని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముగ్గురికి పైగా.. బిడ్డలను కనాలన్న సూచనలు వస్తున్నాయి. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనే విషయంలో యువజంటలు ఏమంటున్నాయి.. వీరితో పాటు 25 ఏళ్ల పైబడి వివాహ ప్రయత్నాల్లో ఉన్న వారి మనోగతంపై 'సాక్షి' గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు అంశాలపై సర్వే నిర్వహించింది. - సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు ఎమ్మెల్యే నాగరాజు హాజరు



వర్ధన్నపేట: హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో కృష్ణా నది జలాలపై రాష్ట్ర భారీ నీటిపారుల శాఖ మంతి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన బుధవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో సిద్ధార్థ ప్రతిభ



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన నాసం సిద్ధార్థ నీట్‌లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఓబీసీ విభాగంలో 37,917 ర్యాంకు సాధించగా.. గురువారం ప్రకటించిన రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో ఓపెన్ కేటగిరీలో 1,111వ ర్యాంకు పొందడం విశేషం. నాసం సూర్యనారాయణ-రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు నాసం అవినాశ్ కరీంనగర్‌లోని చెల్మెడ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. చిన్న కుమారుడు సిద్ధార్థ తాజాగా మెరుగైన ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశం ఉండడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గోడ కూల్చిన వ్యక్తిపై కేసు

సంగెం: గోడ కూల్చి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని కాట్రపల్లి శివారు వడ్డెరగూడేనికి చెందిన అల్లెపు లక్ష్మి, కుమార్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. సొంతస్థలంలో ఐదు రోజుల నుంచి ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఇంటి పక్కన ఉండే అల్లెపు జంపయ్య వచ్చి వారి గోడను కూలగొట్టాడు. బూతులు తిట్టి అడ్డు వెళ్లిన కుమార్‌ను చంపుతానని బెదించాడు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: ముస్లింలు పవిత్రంగా భావించే హజ్‌యాత్ర-26కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు సర్వర్‌మొహియొద్దీన్ ఘాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 31వరకు గడువు ఉందని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ముస్లింలు హజ్‌కమిటీ.జీఓవీ.ఇన్ లేదా హజ్ సువిధ మొబైల్ యాప్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇతర వివరాల కోసం 97044 49236 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్ లీగల్ కౌన్సిల్‌గా నరసింహరాములు



వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా కోర్టు, సబ్ కోర్టులు, జిల్లా వినియోగదారుల ఫోరం పరిధిలోని కేసుల్లో బీఎస్ఎన్ఎల్ పక్షాన న్యాయవాదిగా పి.నరసింహరాములును కొనసాగిస్తూ ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. నరసింహరాములు ఈ పదవిలో మార్చి 2026 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడేదాకా కొనసాగుతారని పేర్కొన్నారు. ఈసందర్భంగా నరసింహరాములును పలువురు న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు.

ఉచిత శిక్షణకు 13న పరీక్ష

విద్యారణ్యపురి: సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్టు ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకున్నవారు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం గౌరవ సంచాలకులు కె.జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 13న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేసి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ, ఉచిత వసతి భోజనంతో కూడిన శిక్షణ పది నెలలు అందిస్తారని తెలిపారు.

కలిసుంటేనే కలదు సుఖం

ఉమ్మడి కుటుంబాలు.. అనుబంధాల నిలయాలు
- కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా, అండగా..
- మారుతున్న పరిస్థితుల్లో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

దుగ్గొండి/ఖానాపురం: ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాయి. నానమ్మ, తాత, పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నాన్న, చిన్నమ్మ, అత్తమ్మ, మామయ్య, పిల్లలు.. ఇలా అందరితో కళకళలాడేవి. అందరూ ఒకేసారి భోజనం చేసేవారు. పండుగలు, ఉత్సవాలను ఆనందంగా జరుపుకునేవారు. అనుబంధాలు, ఆప్యాయతలు ఎక్కువగా ఉండేవి. అందరూ కలిసిమెలిసి పనులు చేసేవారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుండేవారు. మారుతున్న పరిస్థితులు, యాంత్రిక జీవనం, పాశ్చాత్య సంస్కృతి, ఉపాధి, ఉద్యోగాల కోసం ప్రస్తుతం అనేక మంది పట్టణాలు, నగరాలకు వలస వెళ్తుండడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండడంతో ఒకరు లేదా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు యువ జంటలు ఇష్టపడడం లేదు. దీంతో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై వ్యక్తి కుటుంబాలు ఏర్పడుతున్నాయి. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఓరుగల్లులో తగ్గిన జననాల రేటు
- రాష్ట్ర జననాల సగటులో 13వ స్థానంలో ఉమ్మడి జిల్లా
- 2011 నుంచి జననాల రేటు తగ్గుముఖం... ఐదేళ్లలో పుట్టింది 70 వేల మందే..
- ఇలాగైతే వచ్చే ఇరవై ఏళ్లలో పెరగనున్న సీనియర్ సిటిజన్లు
- ఆందోళన కలిగిస్తున్న జననాల సంఖ్య...

- 8లో▸

- సాక్షిప్రతినిధి, వరంగల్



దుగ్గొండి: ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు ములుక దుర్గయ్య. నాచినపల్లి గ్రామానికి చెందిన ఈయనది నిరుపేద కుటుంబం. ఉండేందుకు కనీసం గూడులేని దయనీయ పరిస్థితి. అయినా వెరవలేదు. ఏ పని అయినా అవమానంగా భావించలేదు. దుర్గయ్య-లక్ష్మి దంపతులు తమ కుమారులు రమేశ్, భాస్కర్, నర్సింహారాములు, కరుణాకర్, శంకర్‌ను 10వ తరగతి వరకు చదివించారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఉన్నత చదువులు చదివించలేదు. స్వయం ఉపాధి రంగాల్లో వారిని ప్రోత్సహించారు. దుర్గయ్య మొదట కూలి పనులు చేశాడు. అనంతరం గ్రామాల్లో సైకిల్‌పై తిరుగుతూ బొంబాయి మిఠాయి, ఐస్‌క్రీమ్‌లు, ఉల్లిగడ్డలు విక్రయించాడు. పాత ఇనుప సామాను కూడా కొనుగోలు చేశాడు. గ్రామం నడిబొడ్డున 10 గుంటల ఇంటి స్థలం తీసుకుని ఐదుగురు కుమారులకు ఇళ్లు కట్టించాడు. అయితే, వారందరి ఇళ్లు తన ఇంటి చుట్టూ ఉండేలా నిర్మాణం చేయించాడు. కుమారులు చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తూ వారి పిల్లలను సైతం ప్రయోజకులను చేశారు. దుర్గయ్యకు చెల్లెళ్లు కనకమ్మ, లలిత ఉన్నారు. కనకమ్మ పెళ్లి చేయగా పుట్టు గుడ్డి అయిన లలితను తన కుమార్తె మాదిరిగా సాకుతున్నాడు. వయస్సు మీదపడినా చెల్లెలు బాధ్యత తానే చూసుకుంటున్నాడు. వీరి ఇంటిలో ఏ పండుగా అయినా అందరూ కలిసి ఒక్కచోటే చేసుకుంటారు. జనాభా ఎక్కువగా ఉండడంతో ఒక శుభకార్యంలా జరుపుకుంటారు. కుటుంబంలో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా అందరూ అండగా ఉంటారు. ఇంత మంది ఉన్నా ఒక్కరోజు వీరి ఇంటిలో గొడవలు జరగలేదని గ్రామస్తులు అంటున్నారు. ఒకరిద్దరు పిల్లలు ఉన్న కుటుంబాల్లో నేడు గొడవలు, తల్లిదండ్రులను సాకక పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. కష్టపడి పెంచిన తల్లిదండ్రులకు ఏనాడూ మచ్చ తెచ్చే విధంగా తాము ప్రవర్తించలేదని కుమారులు అంటున్నారు. ఓ తండ్రి, ఐదుగురు కుమారులు.. వారి పిల్లల కుటుంబాలు.. వీరంతా కలిస్తే శుభకార్యానికి బంధువులే అవసరం లేదు. వీరిది వసుధైక కుటుంబం.. ఆదర్శ కుటుంబం అని చెప్పొచ్చు.



ములుక దుర్గయ్య-లక్ష్మి దంపతుల ఉమ్మడి కుటుంబం

ఏడుగురు సంతానమని ఎనాడూ బాధపడలేదు



ఖానాపురం: మాది మధ్య తరగతి కుటుంబం.. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవాళ్లం.. మాకు ఏడుగురు సంతానం.. ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె. ఏడుగురు సంతానమని ఏనాడూ బాధపడలేదు. ఇంతమంది పిల్లలను ఎలా సాకాలనే ఆలోచన కూడా లేకుండా వ్యవసాయంపై శ్రద్ధపెట్టాం. ప్రతీ రోజు వ్యవసాయ పనులు చేశాం. మా బంధువుల పిల్లలు బాగా చదువుకున్నారు. వారిలాగా మా పిల్లలను చదివించాలని నిర్ణయించాం. కుమారులను తెలుగు మీడియం, కుమార్తెను ఇంగ్లిష్ మీడియంలో శక్తిమేర చదివించాం. ఏ పండుగలు వచ్చినా అందరం కలిసి సంతోషంగా జరుపుకుంటాం. - ఎల్లబోయిన శకుంతల-నర్సయ్య, అశోక్‌నగర్



కుటుంబ సభ్యులతో శకుంతుల-నర్సయ్య దంపతులు

ఇద్దరు పిల్లలు ఉండాలి..



కుటుంబంతో అనిల్‌కుమార్

హన్మకొండ కల్చరల్: కాశిబుగ్గకు చెందిన రెడ్డి అనిల్‌కుమార్ ప్రైవే ట్ ఉద్యోగి. అతడికి ఇద్దరు కుమారులు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన అనిల్‌కుమార్ చదువు పూర్తికాకముందే తండ్రి మరణించడంతో తల్లి హాస్పిటల్‌లో పనిచేస్తూ చెల్లిని, అనిల్‌ను సాకింది. అనిల్‌కుమార్ నానమ్మ కూడా వీళ్లతోనే ఉండేది.వృద్ధాప్యంలో ఒకరు కాకపోయినా మరొకరు తోడుగా ఉంటారని ఇద్దరు పిల్లలు ఉండాలని, ఒకరికి ఒకరుతోడుగా ఉంటారన్నారు.

పరిపూర్ణ శాకంబరీగా..



మహాశాకంబరీదేవి అలంకరణలోని అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

● భక్తులకు శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనం

వరంగల్ నగరంలోని శ్రీభద్రకాళి అమ్మవారు గురువారం పరిపూర్ణ శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించిన భక్తులు భద్రకాళి శరణంమమః అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

- హన్మకొండ కల్చరల్

- వివరాలు 8లో▸

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- భోజ్యానాయక్ తండాలో పాఠశాల పునఃప్రారంభం



భోజ్యానాయక్‌తండాలో పాఠశాలను పునఃప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద, విద్యార్థులు



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న కలెక్టర్

నర్సంపేట రూరల్: జిల్లాలోనే గంగదేవిపల్లి, మరియపురం మాత్రమే ఆదర్శ గ్రామాలుగా ఉన్నాయి.. వాటి మాదిరిగానే భోజ్యానాయక్‌తండాను ఆదర్శంగా తీరిదిద్దేందుకు కృషిచేస్తానని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. నర్సంపేట మండలంలోని భోజ్యానాయక్‌తండాలో మూతపడిన పాఠశాలను కలెక్టర్ విద్యార్థులతో కలిసి గురువారం పునఃప్రారంభించి మాట్లాడారు. గంగదేవిపల్లి మాదిరిగానే భోజ్యానాయక్‌తండాను అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపాలని సూచించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఇష్టంగా చదివి భావిభారత పౌరులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. గణితశాస్త్రం, ఆంగ్లంపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, డీఈఓ జ్ఞానేశ్వర్, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ రఘుపతిరెడ్డి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ కొర్ర సారయ్య, ఎంపీఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో ప్రగతి కనిపించాలి

న్యూశాయంపేట: జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో ఇళ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల వెరిఫికేషన్, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, వనమహోత్సవంలో నాటే మొక్కల ప్రగతి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8,750 ఇళ్లు మంజూరు కాగా.. 4,806 గ్రౌండింగ్ అయి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వారంలోగా నిర్మాణ పనులు గ్రౌండింగ్ చేసేలా సంబంధిత అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో జిల్లాను ముందువరుసలో ఉంచాలన్నారు. ఇళ్లను ఎంత త్వరగా పూర్తిచేస్తే అంతే త్వరగా బిల్లులు అందిస్తామని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. రేషన్‌కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 58,841 దరఖాస్తుల్లో 41,836 దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తిఅయ్యిందని తెలిపారు. మిగిలిన వాటిని ఈనెల 13వరకు వెరిఫికేషన్ పూర్తిచేయించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాల్లో 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. దోమలు నిల్వకుండా ఆయిల్‌బాల్స్ ఉపయోగించాలని, గ్రామాల్లో ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. సమీక్షలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, గృహనిర్మాణ పీడీ గణపతి, డీపీఓ కల్పన, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మయోజనపై సమీక్ష..

ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన, తెలంగాణ ఐపాస్, జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ సత్యశారద పాల్గొని మాట్లాడా రు. ప్రధానంగా వృత్తిదారులకు మద్దతుగా పీ ఎం విశ్వకర్మ యోజన అమలు,లబ్ధిదారులకు శిక్షణ, ఆ ర్థిక సాయం,టూల్ కిట్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు.వృత్తిపరమైన నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తూ లబ్ధిదారులు ఆర్థికంగా స్థిరపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టాలి

- గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల తనిఖీ



భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: డ్రెయినేజీలు నిర్మించిన తర్వాత రోడ్లు నిర్మించాలని, అప్రూవల్ తీసుకున్న ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని గ్రేటర్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఆయా విభాగాల అధికారులను హెచ్చరించారు. గురువారం హనుమకొండలోని 4, 5, 6 డివిజన్ల పరిధి టైలర్స్‌స్ట్రీట్, కుమార్‌పల్లి మార్కెట్, రెడ్డిపురం, పెగడపల్లి డబ్బాలు తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ నిర్వహణ పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్.. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి హాజరులో నమోదు చేసిన సిబ్బంది ఏరియాలో ఎక్కడ పనిచేస్తున్నారో తనిఖీ చేశారు. జవాన్లకు కేటాయించిన ఏరియాలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపితే సంబంధిత జవాన్ పెనాల్టీ చెల్లించాలని కమిషనర్ అన్నారు. 53వ డివిజన్ సరస్వతీనగర్, సమ్మయ్యనగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు.

భవన నిర్మాణ అనుమతుల జారీ కోసం పరిశీలన

శంభునిపేట, రెడ్డిపురం, విద్యుత్‌నగర్, గోపాల్‌పూర్, చింతగట్టు బ్రిడ్జి ప్రాంతంలో భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను కమిషనర్ పరిశీలించారు.ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్‌రాడేకర్, ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

ఏటూరునాగారం/వాజేడు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధిలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది వరద క్రమక్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం వరకు రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద నీటిమట్టం 13 మీటర్లకు చేరింది. వరద క్రమంగా పెరుగుతోందని కేంద్ర జలవనరుల అధికారులు తెలిపారు. సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. పేరూరు వద్ద గురువారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు చేరుకుంది. పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ కనిపిస్తోంది.



రామన్నగూడెం వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

క్లుప్తంగా

నర్సంపేట డిగ్రీ కళాశాల సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం,తదితరులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం కేయూలో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ఆ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లం నవీన్ ఫలితాల వివరాలు వెల్లడించారు. బీఎస్సీలో 41.74 శాతం, బీఏలో 51.85శాతం, బీకాంలో 39.92శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.ఈ ఫలితాలను క్యూఆర్ కోడ్, లింక్ ద్వారా కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి ఎస్. కమలాకర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాజీరు, స్టాఫ్‌సెక్రటరీ రహీముద్దీన్, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

17న హనుమకొండలో గిరిజన మార్కెటింగ్ మేళా

ఏటూరునాగారం: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ట్రైబల్ ఫెడరేషన్ మార్కెటింగ్ (ట్రైఫెడ్) ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండలోని గిరిజన భవన్‌లో హస్తకళా ప్రదర్శన, మార్కెటింగ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ చిత్రామిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో గిరిజన కళాత్మక హస్తకళల (దుస్తుల తయారీ, పెయింటింగ్, ఫుడ్ ప్రొడక్ట్స్, వెదురు బుట్టలు అల్లడం) ప్రదర్శన ఉంటుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆసక్తిగల గిరిజన కళాకారులు తాము తయారు చేసిన వస్తువులను ప్రదర్శించడానికి మేళాకు హాజరు కావాలని కోరారు. ఈ ప్రదర్శనకు హాజరయ్యే కళాకారులు తప్పని సరిగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. మేళాకు హాజరైన కళాకారులకు రవాణా చార్జీలను ట్రైఫెడ్ ద్వారా అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం 8330954571 నంబర్‌లో సంప్రదించాలన్నారు.


యువకుడిపై పోక్సో కేసు

పాలకుర్తి టౌన్: ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన ఘటనలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఓ బాలికపై(16 ఏళ్లు) మండలంలోని తీగారం గ్రామానికి చెందిన దండెంపల్లి ప్రణయ్ లైంగికదాడికి పాల్పడగా ఆ బాలిక గర్భం దాల్చింది. ప్రస్తుతం 6 నెలల గర్భవతి అని తెలియడంతో ప్రణయ్.. ఆ బాలికకు గర్భస్రావం కోసం టాబ్లెట్లు ఇచ్చాడు. ఇంటికి వెళ్లాక సదరు బాలిక టాబ్లెట్లు వేసుకోగా రక్తస్రావం అయ్యింది. గమనించి కుటుంబ సభ్యులు బాలికను నిలదీశారు. దీంతో విషయం బయటపడింది. ప్రస్తుతం బాలికను హనుమకొండలోని ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు.



భద్రకాళి ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు, వివిధ పండ్లు, కూరగాయల అలంకరణలో అమ్మవారు





భద్రకాళీ శరణం మమః

అమ్మవారు మహాశాకంబరీదేవిగా దర్శనం
- మితా, చిత్రానిత్యాక్రమంలో పూజలు
- పులకించిన భక్తజనం
- ఘనంగా ముగిసిన శాకంబరీ ఉత్సవాలు



అమ్మవారి ప్రతిమ



పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

హన్మకొండ కల్చరల్ : సర్వాభీష్టములు ఆకలిదప్పులను తీర్చి, దుష్టులను సంహరించే శాకంబరీదేవిగా భద్రకాళీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో భక్తులు భద్రకాళీ శరణం మమ అంటూ పులకించారు. చారిత్రక శ్రీభద్రకాళీ దేవాలయంలో నిర్వహిస్తున్న తిథిమండల దేవాతాయజన పూర్వక శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు గురువారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని మహాశాకంబరీదేవిగా కూరగాయలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. జూన్ 26న ఆషాఢ శుద్ధ పాడ్యమి గురువారం ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కొక్కక్రమంలో పూజలందుకుంటూ ఆషాఢశుద్ధ పౌర్ణమి గురువారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరీదేవిగా భక్తులను అనుగ్రహించింది. ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించిన భక్తులు భద్రకాళీ శరణం మమః అంటూ భక్తిపారవశ్యంలో మునిగారు. ఆలయ అర్చకులు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు అలంకరణలో పాల్గొన్నారు. కాంట్రాక్టర్ మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ, స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచి టన్ను పలు కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించడం ప్రారంభించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది అలుగు కృష్ణ , నాగులు, అశోక్, చింతశ్యామ్ సుందర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మితా, చిత్రానిత్యాక్రమాల్లో పూజలు..

ఉదయం మితా, చిత్రానిత్యాక్రమాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. రాత్రి వరకు కొనసాగింది. శాకంబరీ ఉత్సవాన్ని పురస్కరించుకుని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ..

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మంత్రిని ఘనంగా స్వాగతించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, మరింత ముందుకెళ్లాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు. రాష్ట్ర ప్రజలపై అమ్మ వారి దయ ఉండాలని కోరుకున్నానన్నారు.

కాజీపేట మీదుగా గౌరవ్ టూరిస్ట్ ట్రైన్

- ఈ నెల 19న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం
- ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్



యాత్ర వివరాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు

కాజీపేట రూరల్ : ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల సందర్శన కోసం దివ్యదక్షిణ్ యాత్ర విత్ జ్యోతిర్లింగ ప్యాకేజీతో భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌ను నడిపిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి.వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో గురువారం టూరిస్ట్ ట్రైన్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ కాజీపేటకు 1.55 గంటలకు, వరంగల్‌కు 2.30 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు 7 రాత్రులు, 8 రోజులు పాటు ఉండే గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌ను తమిళనాడు, కేరళలోని తిరువణ్ణమలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తాంజావూరు ప్రదేశాల సందర్శన ఉంటుందని వివరించారు. ఒకరికి బుకింగ్ సాధారణ టికెట్ ధర రూ.14,100, 3 ఏసీ టికెట్ ధర రూ.22,300, 2 ఏసీ టికెట్ ధర రూ. 2900 ఉంటుందన్నారు. ఈ ట్రైన్‌కు సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటలో బోర్డింగ్ పాయింట్స్ ఉంటాయన్నారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల వారు ఈ యాత్ర ట్రైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ బుకింగ్, ఇతర వివరాలకు 040-27702407, 9701360701, 9281495843, 9281495845 నంబర్లు లేదా www.irctctourism.comలో సంప్రదించాలని కోరారు. ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్స్ కె.ప్రశాంత్, ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాకంబరీమాతగా అమ్మవార్ల దర్శనం




కూరగాయల అలంకరణలో శుభానందాదేవి, మహాసరస్వతి అమ్మవార్లు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయాల్లోని శ్రీశుభానందాదేవి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఆషాడమాసం, గురుపౌర్ణమి సందర్భంగా శాకంబరీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అర్చకులు అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



మేలో జరిగిన సరస్వతీనది పుష్కరాల సమయంలో జ్ఞానదీపం



ప్రస్తుతం వరద నీటిలో సగం వరకు మునిగిన జ్ఞానదీపం

నాడు-నేడు..

- వరద నీటిలో జ్ఞానదీపం
- ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో కాళేశ్వరంలోని త్రివేణి సంగమం సరస్వతీఘాట్ వద్ద దేవాదాయశాఖ రూ.17లక్షల వ్యయంతో మెటల్‌తో ఏర్పాటు చేసిన జ్ఞానదీపం(రెండు చేతులు జోడించి తాళపత్రాల్లో దీపం వెలుగు) గురువారం వరద నీటిలో సగం వరకు మునిగింది. కాగా, మే 15 నుంచి 26 వరకు జరిగిన సరస్వతీనది పుష్కరాల్లో జ్ఞానదీపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అప్పుడు త్రివేణి సంగమం వద్ద నీరు తక్కువ ఉంది. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాణహితనదికి వరద తాకిడి పెరిగింది. దీంతో కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరితో కలిసి 10.500 మీటర్ల ఎత్తులో మెట్లను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది.

-కాళేశ్వరం

ప్రతిపక్ష పార్టీ లేఖ రాస్తే.. శాసనసభ ఏర్పాటు చేసే దమ్ముందా..?

- సభా సమావేశానికి ఒక తంతు ఉంటుంది
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



మాట్లాడుతున్న మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి , పక్కన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్

హన్మకొండ: ప్రతిపక్ష పార్టీ లేఖ రాస్తే శాసనసభ ఏర్పాటు చేసే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రశ్నించారు. రాజకీయాల్లో అనేకమంది ముఖ్యమంత్రులను చూశానని, రేవంత్ రెడ్డిని చూస్తే... మాట మార్చడం, మడమ తిప్పడం, ఏమార్చడం ఆయన నీతి, రీతిగా కనిపిస్తుందన్నారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. శాసనసభ సమావేశాలకు ఒక తంతు ఉంటుందన్నారు. ప్రభుత్వం గవర్నర్‌కు సమావేశ తేదీ వివరాలలో లేఖ పంపాల్సి ఉంటుందన్నారు. గవర్నర్ ఆమోదంతో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామంటే లేఖ రాయడానికి సిద్ధమన్నారు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం కాదన్నారు. ప్రెస్ క్లబ్‌ను ఇతర క్లబ్‌లతో పోల్చడం నిరంకుశత్వమన్నారు. పార్టీలు మారినప్పుడు ప్రెస్‌క్లబ్‌కు వెళ్లి మాట్లాడలేదా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, చెప్పులు క్యూలో పెడుతూ నిరీక్షిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2 లక్షల జాబ్ క్యాలండర్ ఎటు పోయిందని నిలదీశారు. సమావేశంలో నాయకులు మర్రి యాదవ రెడ్డి, చింతం సదానందం, పులి రజనీకాంత్, జోరిక రమేశ్, నయీముద్దీన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల బరితెగింపు..

- పహల్గాం దాడికి సంబంధాలంటూ బెదిరింపు
- విచారణకు రండి.. లేదా వెబ్‌సైట్‌లో రిపోర్టు చేయాలి
- డాక్టర్‌ను బురిడీ కొట్టించే ప్రయత్నం
- పోలీసులకు ఫిర్యాదు



డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్

జనగామ: సైబర్ మోసగాళ్ల బరితెగించారు. పహల్గాం దాడి కుట్రలో సంబంధాలు ఉన్నాయంటూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు, ఐఎంఏ ప్రతినిధి లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు పహల్గాం ఉగ్రదాడి ఘటనలో సంబంధాలపై విచారణ ఉందంటూ గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ఫోన్ చేసి భయపెట్టే ప్రయత్నం చేశారు. 'హలో లక్ష్మీనారాయణ గారు పహల్గాం ఉగ్రదాడి విచారణ అధికారిని మాట్లాడుతున్నా.. ఆ దాడి వెనక మీకు సంబంధాలు ఉన్నాయని తెలిసింది.. విచారణకు రావాల్సి ఉంటుంది, లేదంటే వెబ్‌సైట్ ద్వారా రిపోర్టు చేయాలి' అని బోల్తా కొట్టించాడు. అయితే సైబర్ నేరస్తుడిపై డాక్టర్ లక్ష్మీనారాయణకు అనుమానం కలిగింది. పహల్గాం ఘటనకు తనకు సంబంధం ఉంటే పూర్తి సమాచారం స్థానిక పోలీసులకు ఇస్తానని, అక్కడ నుంచి తీసుకోవాలని తెగేసి చెప్పడంతో అనుమానితుడిగా భావించిన సైబర్ నేరస్తుడు ఫోన్ కట్ చేశాడు. వెంటనే జనగామ సీఐ దామోదర్‌రెడ్డికి గుర్తుతెలియని వ్యక్తి సంభాషణను పంపించి, ఇందుకు సంబంధించి విషయాలు వివరించారు. అగంతకుల బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే ఎవరూ భయపడొద్దని, వ్యక్తిగ సమాచారం ఇవ్వొద్దని డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

తీరని విషాదం.. ఒకరి వెంట ఒకరు

తనువు చాలించిన తల్లి, కొడుకు..
- జనగామలో ఘటన
- మృతుడు మాజీ కౌన్సిలర్
- అనారోగ్యంతోనే.. అనుమానం లేదు
- పోలీసులకు మృతుడి సోదరుడి ఫిర్యాదు




అహల్యాదేవి, దయాకర్‌రెడ్డి మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

జనగామ: తల్లి, కొడుకు ఒకేరోజు ఒకరి వెంట ఒకరు తనువుచాలించారు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చారబుడ్డి దయాకర్ రెడ్డి(55), తల్లి అహల్యాదేవి(85) గిర్నిగడ్డలో నివాసముంటున్నారు. దయాకర్‌రెడ్డికి ఇద్దరు అన్నలు ఉన్నారు. ఇందులో ఓ సోదరుడు మృతి చెందగా, రెండో సోదరుడు వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తల్లి బాగోగులు చూసుకునేందుకు దయాకర్‌రెడ్డి జనగామలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల అహల్యాదేవిపై కోతులు దాడులు చేయడంతో కిందపడి తీవ్రంగా గాయపడింది. దీంతో వెన్నుముక ఆపరేషన్ చేయించాడు. ఇదే సమయంలో దయాకర్‌రెడ్డికి కూడా వెన్ను నొప్పి సమస్య తీవ్ర కావడంతో ఆపరేషన్ చేయించుకుని కోలుకున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పని మనిషి బయటకు వెళ్లిన తర్వాత రాగిజావ తయారు చేసి తల్లికి ఇచ్చి తానూ తాగాడు. అనంతరం కొడుకు దయాకర్‌రెడ్డి ఇంటి వెనుక కుర్చీలో, తల్లి అహల్యాదేవి మంచం పక్కన చనిపోయి ఉన్నారు. తల్లి తల కింద నుంచి రక్తం మరకలు ఉన్నాయి. రాగి జావలో పురుగుల మందు కలుపుకుని ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు, పలువురు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లి, తమ్ముడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారి మృతిపై ఎలాంటి అనుమానం లేదని సోదరుడు వాసుదేవ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్, సీఐ దామోదర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని తల్లి, కొడుకు మృతికి గల కారణాలపై ఆధారాలు సేకరించారు. కాగా, దయాకర్‌రెడ్డి, ఆయన తల్లి అహల్యాదేవి మరణ వార్త తెలుసుకున్న అన్ని పార్టీల నాయకులు, స్థానికులు, అభిమానులు అక్కడకు వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగారాఘవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుల కుటుంబీకులను పరామర్శించిన వారిలో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, వెన్నెం సత్యనిరంజన్‌రెడ్డి, జక్కుల వేణు మాధవ్, వంగాల మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నారాయణ, తదితరులున్నారు.

ఓరుగల్లులో తగ్గిన జననాల రేటు

రాష్ట్ర జననాల సగటులో 13వ స్థానంలో ఉమ్మడి జిల్లా

- 2011 నుంచి జననాల రేటు తగ్గుముఖం.. ఐదేళ్లలో పుట్టింది 70 వేల మందే..
- ఇలాగైతే వచ్చే ఇరవై ఏళ్లలో పెరగనున్న సీనియర్ సిటిజన్లు
- ఆందోళన కలిగిస్తున్న జననాల సంఖ్య
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

ఉమ్మడి వరంగల్ జిల్లా జనాభా రేటు ఇలా..

సంవత్సరం	జనాభా	పెరిగిన జనాభా	శాతం
1951	13,29,836	+2,04,177	+18.14
1961	15,45,435	+2,15,599	+16.21
1971	18,70,933	+3,25,498	+21.06
1981	23,00,295	+4,29,362	+22.95
1991	28,18,832	+5,18,537	+22.54
2001	32,46,004	+4,27,172	+15.15
2011	35,12,576	+2,66,572	+8.21
2021	37,50,000	+2,37,424	+6.33
2025	**38,20,000**	**+70,000**	**+1.83**



సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లో జననాల రేటు రోజురోజుకూ పడిపోతోంది. కేంద్ర ప్రభుత్వం గతేడాది పార్లమెంట్‌లో దేశంలోని రాష్ట్రాల వారీగా జనన, మరణాలపై నివేదిక సమర్పించింది. బర్త్ రేటు (జననాల రేటు) తగ్గిందని 2021లో దేశవ్యాప్తంగా నమోదైన జనన రిజిస్టర్ రిపోర్ట్‌నూ వెల్లడించింది. 2021లో జననాల సంఖ్య 2.42 కోట్లుగా ఉంది. రాష్ట్రంలో 2001 నుంచి 2011 పదేళ్లలో సుమారు 42 లక్షల మంది జన్మిస్తే.. 2021 నాటికి ఆ జననాల సంఖ్యతో పోలిస్తే సంఖ్య 5.58 లక్షలు తగ్గిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో ఉమ్మడి వరంగల్‌లో జననాల రేటును పరిశీలిస్తే 2011 నుంచి తగ్గుతూ వస్తోంది. అంతకు ముందు జనాభా వృద్ధి రేటు ప్రకారం గంటకు 60–70 మంది నుంచి 30–35కు పడిపోయింది. ఇందుకు కరోనా మహమ్మారి తర్వాత జననాల సంఖ్య తగ్గిందనేది ఒక కారణం కాగా.. చాలా మంది ఒక్కరు, లేదా ఇద్దరితో సరిపెట్టుకోవడం కూడా కారణమని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఉమ్మడి జిల్లాలు, రాష్ట్రంలో జననాల రేటు ఇ లాగే తగ్గితే వచ్చే 20 ఏళ్లలో యువజనుల సంఖ్య తగ్గి సీని యర్ సిటిజన్లు పెరుగుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

1951 జనాభా వృద్ధి ఇలా..

సాధారణంగా ప్రతీ పదేళ్లకు ఒకసారి దేశ జనాభాను లెక్కిస్తారు. 1872లో మొదటిసారి జనాభాను లెక్కించినప్పటికీ... సమగ్ర జనగణన 1881లో చేపట్టారు. 1952 నుంచి మనదేశంలో జనాభా పెరుగుదలను అరికట్టేందుకు 'కుటుంబ నియంత్రణ' కార్యాచరణ మొదలైంది. రెండు దశాబ్దాలు ఈ కార్యక్రమం సీరియస్‌గా సాగినా.. ఆ తర్వాత నెమ్మదించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

■ Spoken English for Teachers D.Ed / B.Ed / PGs. Results Guaranteed. Rs. 300/- @ BSS GEMS 9494447457, GARLA - Mahabubabad. [WA-6726]

SERVICES

■ పద్మావతి ఫైనాన్స్: హౌసింగ్, బిజినెస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్‌పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్ GST లైసెన్స్ చేయబడును. WGL. 9618767116. [SCA25005682]

BUSINESS OFFER

■ ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [HA-480]

WANTED

■ Lab Technicians (Exp), Pharmacy Boys (Exp), Administrative Officer, Computer Operator & Supervisors. Cont: Guardian Hospital, WGL. 2PM. [WA-537]

■ Mylabs is looking for Lab Technicians in Boduppal, Hyderabad. Q: MLT / DMLT, Exp: 1-2 yrs, Salary: 10-12K. Cont: 8106112401. [SCA25005995]

■ సుజాత కన్సల్టెన్సీ & MSME లో పని చేయుటకు అనుభవం గల అమ్మాయిలు / అబ్బాయిలు కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 8121385555, 8374314933. [SCA25005855]

■ Wanted Sales Manager & Assistant Sales Manager in popular Mobile Stores are preferable. Ph: 9133399257, 9703333378. [G-145]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్టీసీ బస్సును ఢీకొని యువకుడి మృతి

- పాలకుర్తిలో ఘటన



రంజిత్ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : బైక్‌పై అతివేగంగా వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గాడిపెల్లి రంజిత్(20) హైదరాబాద్‌లోని ఓ వైన్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై మైలారం నుంచి పాలకుర్తి మీదుగా జనగామ వెళ్తుండగా జనగామ నుంచి పాలకుర్తికి వచ్చి బస్టాండ్‌లోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్షతగాత్రుడిని 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సును ఢీకొన్న రంజిత్ హెల్మెంట్ ధరించి ఉంటే బతికేవాడు.

అధికారుల తప్పిదం.. రైతుకు శాపం

- పరిహారం చెల్లింపులో జాప్యం
- రోదిస్తున్న నేషనల్ హైవే బాధితుడు



రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న వ్యవసాయ భూమి

హసన్‌పర్తి: అధికారుల తప్పిదం.. రైతుకు శాపంగా మారింది. జాతీయ రహదారి 563లో నిర్మాణంలో భాగంగా అధికారులు చేపట్టిన సర్వే సందర్భంగా అనేక పొరపాట్లు చోటు చేసుకున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లకుండా కేవలం గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే నంబర్లు సేకరించి నివేదిక ఇచ్చినట్లు రైతుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, సూరారం, కోతులనడుమ, వల్భాపూర్, పెంబర్తి గ్రామాల్లో రైతులు భూములు కోల్పోతున్నట్లు నివేదికల్లో పేర్కొనలేదు. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన గొర్రె సారయ్యకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 63/ఏలో సుమారు 0.32 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్నాడు. అయితే సర్వే అధికారులు ఈ నంబర్లను పరిహార జాబితాలో పొందుపరచలేదు. దీంతో సదరు రైతు ఆందోళనకు గురై పరిహారం రాకపోవడంతో చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ భూమి సేకరణకు నోటిఫికేషన్..

సర్వే సందర్భంగా తప్పిపోయిన ఆ భూములను సేకరిస్తున్నట్లు జనవరి 14న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్‌లో ఆయా ప్రాంతాల వారీగా పరిహారం నిర్ణయించారు. హసన్‌పర్తిలో ఎకరానికి రూ.1.06 కోట్లుగా మార్కెట్ ధర నిర్ణయించారు. అయితే ఈ రోడ్డు భూసేకరణ చేపట్టిన సమయంలో 2017లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో మార్కెట్ ధర రూ.51లక్షలు. దీంతో మార్కెట్ ధర రెట్టింపు కావడంతో పరిహారం చెల్లించడానికి అధికారులు జాప్యంచేస్తూ వస్తున్నారని బాధిత రైతు కుటుంబ సభ్యులు తెలిపారు.

అధికారులు స్పందించడం లేదు..

పరిహారం చెల్లింపులో అధికారుల స్పందించడం లేదు. సరైనా సమాచారం కూడా అందించడం లేదు. దీంతో రోజూ కార్యాలయం చుట్టు ప్రదక్షిణ చేస్తున్నా. -గొర్రె కిరణ్, మృతుడి కుమారుడు